సాక్షి ఒడిశా

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,12,911లు, బంగారం 2 గ్రాముల 770 మిల్లీగ్రాములు, వెండి 660 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నువాపడా ఉప ఎన్నిక హోరు

బీజేడీ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలొకియా అకాల మరణంతో నువాపడా శాసనసభ నియోజకవర్గానికి నవంబర్ 11న ఎన్నిక జరగనుంది.

- IIలో



ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాలు ప్రారంభం

రాష్ట్రీయ స్వయం సేవక సంఘ శతవార్షిక వేడుకలను జయపురం ఆర్.ఎస్.ఎస్ శాఖ శనివారం ఘనంగా నిర్వహించింది.

- IIలో

న్యూస్‌రీల్

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఘటనా స్థలంలో లారీ, బైక్

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి కుమార్ ధముని కూడలిలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనచోదకుడు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. దుమురిగుడ పంచాయతీ పారాడిగుడ గ్రామానికి చెందిన కపిల్‌భొయ్ అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా కుమారఖర్ ధముని వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు సకాలంలో బైక్ నుంచి దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బైకు లారీ కిందకు దూసుకుపోవడంతో నుజ్జునుజ్జయ్యింది. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన లారీ డ్రైవర్‌ను స్థానికులు నిలదీశారు.

మునిగుడలో శిశు మహోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ ప్రభుత్వ నోడల్ ఉన్నత పాఠశాలలో శిశుమహోత్సవం సురభి-25 పేరిట శనివారం ఉత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు సుభాష్ కొర, అక్షయ రోదోల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో బీఈవో గణేష్ సాబొరో, ఏబీఈవో సుభాష్ సింగ్, సురభీ పాల్గొన్నారు. కార్యక్రమ ఉద్దేశాన్ని బీఈవో సాబొరో వివరించారు. విద్యార్థుల్లో కళారంగంపై ఉన్న ఆసక్తిని.. వారి ప్రతిభను బయటకు తీసేందుకు ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో 16 క్లస్టర్ విద్యాలయాలకు చెందిన 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకోగా విద్యార్థుల మధ్య నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

షణ్ముఖపాత్రోకు ఎమ్మెల్యే నివాళి



షణ్ముఖపాత్రో భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరీ మజ్జి

కొరాపుట్: ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు షణ్ముఖ పాత్రో ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని ప్రముఖులు సందర్శించి నివాళులర్పిస్తున్నారు. ఇందులో భాగంగా బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి.. నందాహండి సమితి సొరుగుడ గ్రామంలో గోవిందాలయ ఆశ్రమంలో షణ్ముఖ పాత్రో భౌతికకాయానికి శనివారం నివాళులర్పించారు. షణ్ముఖపాత్రో సేవలు గుర్తు చేశారు. జిల్లాకి చెందిన షణ్ముఖ సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గోవిందాలయ స్వచ్ఛందసంస్థను ఏర్పాటు చేసి అంబులెన్స్, గిరిజనులకు విద్యాబోధన తదితర సేవలు అందజేసేవారు.

గంజాయి స్వాధీనం



రైల్వే పోలీసులకు చిక్కిన గంజాయి నిందితులు

కొరాపుట్: గంజాయి తరలిస్తున్న వారిని కొరాపుట్ రైల్వే పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కొరాపుట్ రైల్వే స్టేషన్లో జీఆర్‌పీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పాండిచేరికి చెందిన ప్యాసింజర్లు ఎం.ప్రభాకర్, అజయ్ కదలికలు అనుమానంగా ఉండడంతో వారి బ్యాగులు పరిశీలించగా.. అందులో నాలుగు కిలోల గంజాయి పట్టుబడింది. తమ దుస్తుల మధ్య గంజాయి దాచి పెట్టారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి గంజాయి సీజ్ చేశారు.

కత్తి దూసిన బాల్యం



మజేష్ మృతదేహం

నిందిత బాలుడిని తీసుకెళ్తున్న పోలీసులు

ఘటనా స్థలంలో కత్తి

- ఐదేళ్ల బాలుడిని నరికి చంపిన మరో బాలుడు
- కుటుంబ కక్షలతో దారుణం
- నవరంగ్‌పూర్ జిల్లాలో ఘటన

కొరాపుట్ : పలక, బలపం పట్టుకోవాల్సిన చేతులు కత్తిపట్టాయి. ప్రాణం అంటే కూడా ఏంటో తెలియని వయసులో మరో ప్రాణాన్ని బలిగొన్నాయి. ఓ వ్యక్తితో ఉన్న వైరం అతని కుమారుడిని చంపే వరకు వెళ్లింది. ఈ దారుణ ఘటన శనివారం నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి తెంతులికుంట్ పంచాయతీ క్రిష్ణగుడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ మహురియా కుమారుడు మజేష్ మహురియా(5) శనివారం ఉదయం నుంచి కనిపించలేదు. దీంతో తండ్రి అన్నిచోట్లా వెతికాడు. చివరికి పాడుబడిన ఓ ఇంట్లో మజేష్ మృతదేహం కనిపించింది. శివ రాక చూసి నిందితుడు వెంటనే పక్క గదిలోకి వెళ్లి దాక్కున్నాడు. మృతదేహం పక్కన కత్తి పడి ఉండటాన్ని గుర్తించి వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఆరా తీయగా ఈ దారుణ ఘటనకు పాల్పడినది సమీప బంధువైన 14 ఏళ్ల బాలుడిగా గుర్తించారు. అనంతరం నిందిత బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. శివకు, నిందితుడికి మధ్య ఇటీవల వివాదం జరిగింది. ఆ కక్ష పెట్టుకుని శివ కుమారుడిని హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన యాత్ర



పచ్చజెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న అధికారులు

జయపురం: విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ ఉద్యోగుల రక్షణ, భద్రతపై అవగాహనకు టీపీఎస్ఓడీఎల్ (టాటా పవర్ సప్లయ్ ఒడిశా డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్) ఉద్యోగి ఇ.సౌమ్యరంజన్ లెంక జయపురం విద్యుత్ ఇంజినీరింగ్ విభాగ కార్యాలయం నుంచి శనివారం సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఆయన జయపురం నుంచి వయా బరంపురం మీదుగా బలంగీర్ వరకు సైకిల్ యాత్ర చేస్తారు. జయపురం సర్కిల్ హెడ్ మన్మథనాథ్ మిశ్ర, దేబేస్ పండ, బిశ్వజిత్ మెండులి విద్యుత్ సురక్షా అధికారి ప్రమోద్ కుమార్ బెహరలు పచ్చ జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు. విద్యుత్ వినియోగం, విధి నిర్వహణలో ఎల్లప్పుడూ రక్షణ జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. సైకిల్ యాత్ర మధ్యలో గ్రామాలు, పట్టణాలు, విద్యాలయాలలో సౌరశక్తి సద్వినియోగం, విద్యుత్ సురక్షలపై పాదయాత్ర, సభలు, నిర్వహించి ప్రజలను, విద్యార్థులను సచేతనులను చేసేందుకు ప్రయత్నిస్తానని సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న లెంక వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఆర్‌టీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోష్ కుమార్ మహంతి, చందన రెడ్డి, రాజేష్ కుమార్ సాహు, పరిమల పాల్, బిచిత్ర కుమార్ బెహర, రంధీర్ సింగ్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ



ఘటనా స్థలంలో రామ్‌కుమార్ మృతదేహం



మల్కన్‌గిరి ఆస్పత్రి వద్ద బంధువులు

- ముగ్గురు మృతి.. ఒకరికి గాయాలు

మల్కన్‌గిరి : కోరుకొండ సమితి టిక్‌బేడ రహదారిలో శనివారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మల్కనన్‌గిరికి చెందిన రామ్‌కుమార్ (35), యమున సర్దార్ (28) ద్విచక్ర వాహనంపై బయలుదేరి మల్కన్‌గిరి–బలిమెల ప్రధాన రహదారిలో టిక్‌బేడ వద్దకు వచ్చేసరికి ఎదురుగా కోరుకొండ సమితిలోని ఇందిరా ఆవాస్ కాలనీకి చెందిన మోహన్ మాఝి (23), మధు జానీ బైక్‌పై వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో రామ్‌కుమార్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానికులు వెంటనే స్పందించి కోరుకొండ పోలీసులకు సమాచారం అందించడంతో ఐఐసీ హిమాన్షు శేఖర్‌బారిక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అంబులెన్సులో తరలించగా యమున, మోహన్ చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యా నేరంపై ముగ్గురు అరెస్టు



అరెస్టయిన నిందితులతో పోలీసులు

- పరారీలో ఒకరు

మల్కన్‌గిరి: హత్యా నేరంపై ముగ్గురు అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి సమితిలో ఈ నెల నాలుగో తేదీన నముడాగూడ గ్రామ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. దర్యాప్తు చేసిన మాత్తిలి పోలీసులు మృతుడు విష్ణు నాయక్‌గా గుర్తించారు. ఆయన తండ్రి విజయ్ నాయక్ తన బిడ్డను ఎవరో హత్య చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేశారు. మృతుడి ఫోన్ నంబర్ ఆధారంగా సాంకేతిక డేటా, పరిసర పరిస్థితులను పరిశీలించి హత్యతో సంబంధం ఉన్నట్టు భావిస్తున్న ముగ్గురిని శనివారం అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిందితులుగా దీపక్ ఓరా, శంకర్ ఇడియా, సాగర్ సునాం, మనోజ్ గౌడ్‌లను అరెస్టు చేయగా.. దీపక్ పరారీలో ఉన్నట్టు మాత్తిలి ఐఐసీ దీపాంజలి ప్రధాన్ తెలిపారు. నిందితులను కోర్టుకు తరలించినట్టు పేర్కొన్నారు. మృతుడు తండ్రి మాట్లాడుతూ.. నిందితులకు కఠిన శిక్ష వేయాలని వేడుకున్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీడీవో దళపతి

- బీడీవో కృష్ణ చంద్ర దళపతి

రాయగడ: మునిగుడ సమితి పరిధిలోని వివిధ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రజా ప్రతనిధులు కృషి చేయాలని వారి వారి ప్రాంతాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే అవకాశం కలుగుతుందని బీడీవో కృష్ణ చంద్ర దళపతి అన్నారు. స్థానిక సమితి సమావేశం హాల్‌లో పంచాయతీ సర్పంచ్‌లు, సమితి, వార్డు సభ్యులతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల్లో వికసిత గ్రామం, వికసిత ఒడిశా పథకాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. గ్రామాలకు అనుసంధానించే రహదారులు, విద్య, వైద్యం ఆవాస్ గృహాలు వంటి మౌలిక సౌకర్యాలు అందరికీ అందేలా సహకరించాలని అన్నారు. గ్రామీణ గృహ నిర్మాణ యోజన పథకంలో భాగంగా లబ్ధిదారులు సులువుగా పథకాన్ని పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమితి అధ్యక్షురాలు దుఖిని నుంద్రుక అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు సంతోష్ సున, జిల్లా పరిషత్ సభ్యులు మాధవీ కొంధొపాణి, సమితి ఉపాధ్యక్షులు ఆదర్శ కులసిక, ఎంపీ ప్రతినిధి రజనీకాంత్ పడాల్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

రాయగడ: ఆల్ ఒడిశా ఆశా కార్యకర్తల మహాసంఘం పిలుపు మేరకు జిల్లా ఆశా కార్యకర్తల సంఘం శనివారం ఆందోళన చేపట్టింది. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని ఏడీఎం రమేష్ చంద్రనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా గాంధీ పార్క్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సంఘం రాయగడ శాఖ అధ్యక్షురాలు తమల్ సాహుకార్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు జోగేశ్వర్ దాస్, సభ్యుడు అరుణ్‌కుమార్ లెంక తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 12 నుంచి మండయ్ ఉత్సవాలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా గిరిజన సాంస్కృతిక ఉత్సవం మండయ్–2025 డిసెంబర్ 12వ తేదీ నుంచి ప్రారంభవుతాయని రాష్ట్ర గిరిజన, ప్రాథమిక విద్యా, మైనారిటీ శాఖా మంత్రి నిత్యానంద గొండో ప్రకటించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరంలో శనివారం జరిగిన మండయ్ సన్నాహక సమావేశంలో ప్రసంగించారు. ఈ ఉత్సవాలు డిసెంబర్ 16వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. మండయ్ శుభారంభం నవంబర్ 25వ తేదీన ఉమ్మర్‌కోట్ డివిజన్ డోంగ్ర సమీపంలో పుడాఘడ్ వద్ద ప్రారంభ పూజలు జరుగుతాయన్నారు. అనంతరం పంచాయతీ, సమితి, జిల్లా స్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల కళాకారులు ముగింపు వేడుకలలో తమ ప్రదర్శనలు ఇస్తారని మంత్రి గొండో ప్రకటించారు. సమావేశంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, జిల్లా కలెక్టర్ మహేశ్వర్ స్వయ్, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

చెట్టు మీద దెయ్యం.. అమ్మో భయం!



ట్రాక్టర్‌పై హంటర్ ట్రీ



చెట్టును కాల్చివేస్తున్న దృశ్యం

- సుభయ్ గ్రామంలో చెట్టుపై ఆత్మ ఉందంటూ అలజడి
- చెట్టును కొట్టేసి నదిలో నిమజ్జనం చేసేందుకు గ్రామస్తుల యత్నం
- అంగీకరించని పరిసర పొరుగు గ్రామాల ప్రజలు
- ఎట్టకేలకు పోలీస్‌స్టేషన్‌లో చెట్టును దగ్ధం చేసిన సిబ్బంది

కొరాపుట్ : కొరాపుట్ జిల్లాలో రెండు రోజులుగా గిరిజనుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఆత్మ చెట్టు (హంటర్ ట్రీ) కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. ఎటువంటి వివాదాలకు తావులేకుండా పోలీసులే ప్రజాప్రతినిధుల సమక్షంలో చెట్టును దగ్ధం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిమిలిగుడ సమితి సుభయ్ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆందోళనకు గురైన గ్రామస్తులు మంత్రగాడి వద్దకు వెళ్లారు. అతను పూజలు చేసి గ్రామ శివారులోని చెట్టుపై ఆత్మ ఉందని, చెట్టు కొట్టేసి నదిలో నిమజ్జనం చేయాలని సూచించాడు. దాంతో గ్రామ యువకులు చెట్టును కొట్టేసి ట్రాక్టర్‌లో వేసి నదిలో వేయడానికి వెళ్లారు. నదిని ఆనుకుని ఉన్న ప్రతి గ్రామంలోనూ స్థానికులు తమ పరిధిలో చెట్టుని నిమజ్జనం చేయడానికి వీల్లేదని ప్రతిఘటించారు. పలుచోట్ల తమ సంప్రదాయ ఆయుధాలు పట్టుకొని పహారా కాశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అన్ని గ్రామాల ప్రజలను రప్పించి ప్రజాప్రతినిధుల సమక్షంలో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సునాబెడా పోలీస్ స్టేషన్ పరిధిలోనే దగ్ధం చేశారు.

పర్యావరణంపై చైతన్యం అవసరం



గొడొపాదర్ పాఠశాల మాట్లాడుతున్న సిటీ స్కూల్ ఉపాధ్యాయుడు ప్రతాప్ పట్నాయక్

జయపురం: పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం అవసరమని వక్తలు అన్నారు. జయపురం తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహిస్తున్న సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలల్లోని పాఠశాలల విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై చైతన్య కార్యక్రమాలకు శనివారం శ్రీకారం చుట్టారు. సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైకిళ్లపై జయపురం సమితి గొడొపాదర్ గ్రామానికి వెళ్లి ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య పరిరక్షణలో గ్రామస్తులను మమేకం చేసి వారిచే మొక్కలు నాటించటం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని సూచించారు. ఉభయ పాఠశాలల విద్యార్థులు పర్యావరణంపై ముఖాముఖీ చర్చించుకుని ఒకరి అభిప్రాయాలను మరొకరు తెలుసుకున్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. సిటీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాప్ పట్నాయక్ పర్యావరణ ఆవశ్యకతను వివరించారు. గొడొపాదర్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దిలీప్ పండ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమానికి షోషియల్, ఎడ్యుకేషనల్ ఎన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీవా) అధ్యక్షులు సుధాకర పట్నాయక్, సీనియర్ సభ్యులు కె.మోహనరావు, జి.వెంకటరెడ్డి సహకరించగా సిటీ స్కూల్ ఉపాధ్యాయులు జి.సాయిశేఖర్, ధనపతి భొత్రలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



సిటీ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న గొడొపాదర్ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

అమోనియా కంటైనర్ బోల్తా



బోల్తాపడిన కంటైనర్

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని జర్జంగి గ్రామ సమీప జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఒక భారీ కంటైనర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి శ్రీకాకుళం వైపు అమోనియా లోడ్‌తో వెళ్తున్న భారీ కంటైనర్ జర్జంగి గ్రామ సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

జిల్లాను స్వచ్ఛంగా మార్చుదాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



చెత్తను డస్ట్‌బిన్‌లో వేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి: రాష్ట్రంలో మన జిల్లాను స్వచ్ఛంగా మార్చుకుందామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మూడో శనివారం పురస్కరించుకొని వాయు కాలుష్య నివారణ థీమ్‌తో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అరసవల్లి ఇంద్ర పుష్కరిణి వెనుక భాగంలో కాజీపేట కూడలి వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకర సమాజాన్ని రూపొందించవచ్చన్నారు. అనంతరం కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకరరావు, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, అరసవల్లి ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు

- ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: ఇటీవల కొన్ని పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్త కథనాలు పూర్తి అవాస్తవమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తనకు ఎటువంటి గ్యాంగ్‌లు లేవని, తన బలం ప్రజలేనని తెలిపారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరు నమ్మవద్దని కోరారు. కొంతమంది వ్యక్తులు బాధితులను ఉసిగొల్పి తప్పుడు ఆరోపణలు చేయించారన్నారు. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వార్తలు ప్రచురించే ముందు ధ్రువీకరించుకోవాలని మీడియా ప్రతినిధులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో వసంత్ మృతదేహం (ఇన్‌సెట్లో) వసంత్(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం లొద్దపుట్టిలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లొద్దపుట్టి గ్రామం అంబుగాం వీధికి చెందిన పిట్ట మోహనరావు, కుమారీల కుమారుడు పిట్ట వసంత్(32) కాకినాడలో చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం తండ్రి మోహనరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ భారాన్ని మోస్తున్న వసంత్, ఈ ఏడాది మార్చి 7న ఇచ్ఛాపురం బెల్లుపడకు చెందిన సంధ్య ఉరఫ్ ఇందును వివాహం చేసుకున్నాడు. శనివారం అరకు విహార యాత్ర కోసం తన ద్విచక్ర వాహనంపై భార్య సంధ్యను తీసుకొని వెళ్తుండగా, ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంజరిగింది. ఈ ప్రమాదంలో వసంత్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతోంది. జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ సమీపంలో రొయ్యల మేత తీసుకెళ్తున్న వ్యాన్ మరమ్మతులకు గురికావడంతో నిలిపివేశారు. ఆగి ఉన్న వ్యాన్‌ను వసంతకుమార్ బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నవ దంపతులను మృత్యువు విడగొట్టిందని బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఘనంగా దీపావళి



భారత్ ఆపరేషన్ సిందూర్ ఆకారంలో వెలిగించిన దీపాలు



దీపాలను వెలిగిస్తున్న శిశు మందిర్ విద్యార్థినులు



సరస్వతీ శిశు విద్యామందిర్‌లో దీపావళి పండుగను నిర్వహిస్తున్న ఆచార్య సరోజ్ కుమార్ పండా

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో శనివారం సాయంత్రం దీపావళి పండను ముందస్తుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవీ మఠం మహంత రామానంద దాస్ విచ్చేశారు. విద్యాలయం పర్యవేక్షణ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర పట్నాయక్ జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించేందుకే ఈ పండగ నిర్వహిస్తారన్నారు. భారత త్రివిధ దళాలు సాధించిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని పలువురు కొనియాడారు. కాశ్మీర్‌లో పెహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు శ్రద్ధాంజలి తెలిపారు. అనంతరం 2000 దీపాలు పాఠశాల ఆవరణలో భారత్ మాత ఆకారంలో వెలిగించి దీపావళిని ఆనందోత్సవాలతో నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా ఆధ్వర్యంలో జరిగాయి.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య శ్రామికులు

జయపురం: జయపురం మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో గల 10 ట్రాక్టర్లలో పని చేస్తున్న 30 మంది, 20 టాటా ఏస్ వాహనాలలో పని చేస్తున్న 40 మంది పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. జీతాలు ఇచ్చేంత వరకు వాహనాలు నడిపేదీ లేదన్నారు. కంట్రాక్టర్ వచ్చి నెల జీతం చెల్లించటంతో ఆందోళన విరమించి పనుల్లోకి చేరారు. మున్సిపాలిటీ నిబంధన ప్రకారం పారిశుద్ధ్య కార్మికులను కంట్రాక్టర్ ప్రతి నెలా జీతాలు చెల్లించకపోతే.. మున్సిపాలిటీ చెల్లించాలన్నారు. రెండు రోజుల్లో దీపావళి ఉన్నా కంట్రాక్ట్ కంపెనీ జీతాలు ఇవ్వకపోవటంతో ఆందోళనకు దిగినట్లు డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. ఈపీఎఫ్, ఈఎస్ఐలు ప్రతి నెలా సకాలంలో జమ చేయటం లేదని ఆరోపించారు. ఒప్పందం ప్రకారం వీటిని ప్రతి నెలా కంట్రాక్టర్ జమ చేయాలని, లేకపోతే జరిమానా పడుతుందన్నారు. మున్సిపాలిటీ కంట్రాక్ట్ సంస్థకు పట్టణ పారిశుద్ధ్యం నిమిత్తం నెలకు రూ.76 లక్షలకు పైగా బిల్లు చెల్లిస్తుందన్నారు. మున్సిపాలిటీలో గల 28 వార్డులను 4 జోన్‌లుగా విభజించి 371 మంది పారిశుద్ధ్య స్వీపర్లను నియమించింది. వీరిలో ఆందోళన చేపట్టిన 70 మంది వాహనాల్లో పని చేస్తున్నారు.

వ్యాధుల నివారణకు సమగ్ర చర్యలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్‌తోపాటు వైద్యశాఖ అధికారులు, ఇతర సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశం హాల్‌లో వేక్టర్ వ్యాధి (దోమల ద్వారా వచ్చే వ్యాధులు) నివారణకు శనివారం జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ సమగ్ర చర్యలు ప్రారంభించారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధుల ఉధృతిని నియంత్రించేందుకు ప్రతి సమితిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహస్తామని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ దోలామణి ప్రధాన్ అన్నారు. వర్షకాలంలో దోమలు ఎక్కువగా ఉన్నందున్న ప్రతి గ్రామంలో పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. దోమ తెరలు వాడాలని, జిల్లా కేంద్రం ప్రతీరోజు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా నిల్వ నీటిని తొలగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, మాలేరియశాఖల వైద్యులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాలు ప్రారంభం



ఆర్.ఎస్.ఎస్ కార్యకలాపాలను వివరిస్తున్న దృశ్యం

జయపురం: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ శతవార్షిక వేడుకలను జయపురం ఆర్.ఎస్.ఎస్ శాఖ శనివారం ఘనంగా నిర్వహించింది. స్థానిక భూపతి వీధి కనకదుర్గ మందిర ప్రాంగణంలో నిర్వహించిన శతాబ్ది ఉత్సవాల్లో జయపురంలో పాణినాళ వీధి, రాధామాధవ వీధి, కెల్లా వీధికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శత వార్షిక వేడుకల్లో పాల్గొన్నారు. న్యాయవాది, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బిరేష్ పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బిరేష్ పట్నాయక్ దీప ప్రజ్వలన చేసి శత వార్షిక ఉత్సవాన్ని ప్రారంభించారు. ముఖ్యవక్తగా అధ్యాపకులు, గ్రామ వికాశ కార్యకర్త బిజయకుమార్ భట్, పట్టణ ఆర్ఎస్ఎస్ సంఘ పరిచాలకులు డాక్టర్ నిరంజన్ మిశ్ర వేదికపై ఆశీనులయ్యారు. వక్తలు ఆర్ఎస్ఎస్ గత వందేళ్లుగా దేశానికి అందిస్తున్న సేవలను వివరించారు. ఆర్ఎస్ఎస్ సంఘం జాతి, కుల, మతాలకు ఎటువంటి ప్రాధాన్యత నీయలేదని వెల్లడించారు. ఎవరు ఏ ధర్మం వారైనా దేశ భక్తి, హిందూ దేశ నిర్మాణం పట్ల ఆసక్తి ఉన్న వారెవరైనా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హిందూ రాష్ట్ర నిర్మాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యపరచేందుకు కార్యకర్తలు సమైఖ్యంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సుబ్రత పండా, సత్యనారాయణ మిశ్ర, కార్యదర్శి సురేష్ నందా, శుభం పండాలు ఆర్ఎస్ఎస్ ప్రార్థన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రేమానంద నాయక్, నారాయణ మిశ్ర, ప్రపుల్ల రాయ్, బలరాం పాడీ, సుధాంశు పాడీ, తేజస్వీ చౌదరి, జితు దొలాయ్, గుప్త పాహిగ్రాహి, వై.ఎస్.ఖన్నతో పాటు 50 మందికి పైగా పాల్గొన్నారు.



శత వార్షిక ఉత్సవాలను ప్రారంభిస్తున్న బిరేష్ పట్నాయక్

అనుమతులెలా ఇచ్చారు..?



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

టెక్కలి: జనావాసాలు, విద్యా సంస్థలు ఉన్న ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలకు ఎలా అనుమతులిచ్చారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ టెక్కలి అగ్నిమాపక అధికారి సూర్యారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్కలిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల పరిశీలన కోసం విచ్చేసిన ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి పరిశీలన, స్థానిక అభ్యంతరాలు చూడకుండా కేవలం పత్రాలు చూసి అనుమతులు ఇచ్చారా అని నిలదీశారు. తక్షణమే అభ్యంతరకంగా ఉన్న దుకాణాన్ని మార్పు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ బి.సత్యం, డీఎల్‌పీవో ఐ.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అపహాస్యం



చారు లేకుండానే అన్నం తింటున్న విద్యార్థులు

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ పంచాయతీ మహాసింగిగూడ ఆర్ఆర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అపహాస్యం చేసేవిధంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలో 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. 18 మంది పిల్లలకు పాఠశాల అవరణలో వంట చేయడం లేదు. ఇంటి వద్ద వంట చేసి పాఠశాలకు వంట ఏజెన్సీ సభ్యురాలికి బదులు ఆమె భర్త ప్రతిరోజూ తీసుకొచ్చి విద్యార్థులకు వడ్డన చేస్తుంటారు. శనివారం మధ్యాహ్నం భోజనాన్ని పాఠశాలలో కేవలం నలుగు విద్యార్థులు మాత్రమే చేశారు. అయితే నలుగు విద్యార్థులకు కేవలం అన్నం, కూర పెట్టారు తప్ప, చారు మాత్రము తీసుకు రాలేదు. చారులేక పోవడంతో విద్యార్థులు భోజనం చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. మిగిలిన 14 మంది విద్యార్థులు గ్రామంలో జరిగిన అన్నదాన కార్యక్రమానికి హాజరైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు తెలిపారు. పాఠశాల వద్ద గదులు సక్రమంగా లేకపోవడం వలన ఇంటి వద్ద వంట చేయిస్తున్నట్లు చెప్పారు.

కేంద్రమంత్రి సమక్షంలో బయటపడ్డ గ్రూపు తగాదాలు

సారవకోట: మండలంలోని సవర మాకువ నుంచి కాలనీ మాకువ వరకు నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో మాకువ గ్రామంలోని టీడీపీలో ఉన్న గ్రూపు తగాదాలు బయటపడ్డాయి. ఎన్నికల ముందు ఎంపీపీ కూర్మినాయుడుతో టీడీపీలో చేరిన నక్క రామరాజు ఇంటికి కేంద్రమంత్రి వెళ్లడంతో పాత టీడీపీ వర్గీయులు తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీలేక పాత టీడీపీ వర్గీయులైన సిరిపురం అప్పలనాయుడు, మామిడి ఆనందరావుల ఇంటికి సైతం వెళ్లాల్సి వచ్చింది. వారి వారి ఇళ్ల నుంచి కేంద్రమంత్రి బయటకు వచ్చిన తర్వాత ఆ రెండు వర్గాల మధ్య వాగ్వివాదం జరగగా పోలీసులు కలగజేసుకుని విషయం పెద్దది కాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటన జరిగిన తర్వాత ఎంపీపీ స్వగ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి పాత టీడీపీ వర్గం హాజరు కాలేదు. అలాగే తర్లి గ్రామానికి నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి ఎంపీపీ వర్గం హాజరవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా చిన్నకిట్టాలపాడు పంచాయతీ సవర కురిడింగి గ్రామానికి నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి ఆ పంచాయతీకి చెందిన పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావును ఆహ్వానించకపోవడంతో ఆయన అసంతృప్తి చెందారు. కాగా పర్యటనలో భాగంగా కొండ చీపురు పంటకు మద్దతు ధర కల్పించాలని సవరమాకువ గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పంచాయతీ రాజ్ ఈఈ ఎస్.రామకృష్ణ, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ కూర్మినాయుడు, ధర్మాన తేజ్‌కుమార్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నువాపడా ఉప ఎన్నిక హోరు

- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఘసిరామ్ మాఝి



కాంగ్రెస్ నాయకుల ఊరేగింపు



నామినేషను దాఖలు ఊరేగింపులో బీజేపీ అభ్యర్థి

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర ధొలాకియా అకాల మరణంతో నువాపడా శాసనసభ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఏడాది నవంబర్ 11న ఈ ఎన్నిక జరుగుతుంది. ఉప ఎన్నికకు కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు తమ నామినేషన్ దస్తావేజులు శనివారం దాఖలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ గిరిజన నాయకుడు, కాంగ్రెస్ అభ్యర్థి ఘసిరామ్ మాఝి ఆయన అనుచరులతో భారీ ఊరేగింపులో పాల్గొన్నారు. బడుగు, గిరిజన వర్గాలతో బలమైన సంబంధాలకు పేరుగాంచిన ఘసిరామ్ మాఝి గత 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. భూమి హక్కులు, గిరిజన వర్గాల సంక్షేమం వంటి కీలకమైన స్థానిక సమస్యలను పరిష్కరించడంలో తన నిబద్ధతను నొక్కి చెప్పారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి జయ ధొలాకియా నువాపడా సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, మంత్రులు గణేష్ రామ్ సింగ్ ఖుంటియా, రబి నారాయణ్ నాయక్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బసంత్ పండా, జిల్లా అధ్యక్షుడు కమలేష్ దీక్షిత్, ఇతర పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి జయ ధొలాకియా

సైబర్ మోసాలపై అవగాహన



ప్రత్యక్షప్రసారాన్ని వీక్షిస్తున్న పోలీసు అధికారులు

పర్లాకిమిడి: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు అరికట్టడానికి 'సైబర్ సేఫ్టీ ప్రచారం 2025'ను కళింగ స్టేడియంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని సెంచూరియన్ వర్సిటీలోని ఓపెన్ స్టేడియంలో శనివారం ప్రసారం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, అదనపు ఎస్పీ సునీల్ కుమార్ మహంతి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఐఐసీ (పర్లాకిమిడి) ప్రశాంత భూపతి, గురండి పోలీసు అధికారి ఓంనారయణ పాత్రో, అటవీ శాఖ అధికారులు హాజరయ్యారు. స్టాప్, వెరిఫై, సెక్యూర్ పేరిట 16 జిల్లాలో సైబర్ రథాలు ప్రచారంలో పాల్గొంటాయని అధికారులు తెలియజేశారు. నెల రోజులపాటు ప్రజల్లో సైబర్ నేరాలు, నెట్ బ్యాంకింగ్ సేవల్లో జాగ్రత్త వహించడం, ఏ.టి.ఎంలో సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఎస్పీ జ్యోతింద్ర పండా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, డైరెక్టర్ (అడ్మిన్) దుర్గాప్రసాద్ పాడీ, సోయెట్ డీన్ డాక్టర్ ప్రపుల్ల కుమార్ పండా, తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలను అరికడతామని ప్రమాణం చేస్తున్న పోలీసు అధికారులు

భారీగా మందుగుండు నిల్వలు సీజ్

కంచిలి: మండలంలో అనుమతి పొందిన నాలుగు మందుగుండు దుకాణాల్లో అధిక మొత్తంలో టపాసులు నిల్వలు ఉన్నాయనే కారణంతో పోలీసులు ఆ సరుకును సీజ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలియజేశారు. కంచిలిలో బలియాపుట్టుగ వద్ద తెల్లి వైకుంఠరావుకు చెందిన రూ.2,69,470ల సరుకు, అంపురం వద్ద సుంకర మణికంఠకు చెందిన రూ.1,71,900ల సరుకు, జాడుపూడిలో దూపాన సునీల్‌కు చెందిన రూ.1,16,497లు విలువ కలిగిన సరకు, అదే గ్రామంలో దూపాన శ్రీనివాసరెడ్డికి చెందిన రూ.1,15,300లు విలువ గల సరకును సీజ్ చేసినట్లు వెల్లడించారు.

సారవకోట: మండలంలోని కొమ్మొసరియాపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రూ.50 వేలు విలువ కలిగిన బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన పైల సుశీల, లుకలాపు తిరుపతిరావు బాణసంచాతో పాటు బాణసంచా తయారు చేయడానికి కావాల్సిన ముడి సరుకులు కలిగి ఉండడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారి ఇళ్లపై దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బాణసంచాను సారవకోట పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. దీంట్లో పైల సుశీల వద్ద నుంచి రూ.30 వేలు విలువ కలిగిన బాణసంచా, లుకలాపు తిరుపతిరావు నుంచి రూ.20 వేలు విలువ కలిగిన బాణసంచా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేశారు.



సారవకోట: స్వాధీనం చేసుకున్న బాణసంచా, తయారీ వస్తువులు

మోసం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



కరవంజలో మాట్లాడుతున్న కృష్ణదాస్

జలుమూరు: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేయడమే చంద్రబాబు నైజమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. మండలంలోని కరవంజ – టెక్కలిపాడు క్లస్టర్ సమావేశంలో శనివారం మాట్లాడారు. పేదలకు వైద్యం దూరం చేయడమే చంద్రబాబు ధ్యేయమన్నారు. అందుకు మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నాడన్నారు. దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాలు కార్యక్రమం తలపెట్టామని తెలియజేశారు. అన్నమయ్య జిల్లాలోని ములకల చెరువుతో పాటు నరసన్నపేట నియోజకవర్గంలో బుడితి వద్ద అవలింగి గ్రామంలో మినీ పరిశ్రమ పెట్టి టీడీపీ నాయకులు మద్యం కల్తీ చేస్తున్నారని మండిపడ్డారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే రమణమూర్తిదే సిండికేట్ అని, వారి కుటుంబ సభ్యుల పేరిట మద్యం షాపులు ఉన్నాయని వివరించారు. అవలింగిలో కల్తీ జరిగిన మద్యం పట్టుకున్న అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో వివరించాలన్నారు. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, రైతు పండించిన పంటలకు మద్దతు ధర లేదని మండిపడ్డారు. అనంతరం డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరించి, కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు.

కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా కార్యదర్శి ఎం.శ్యామలరావు, సర్పంచ్ జుత్తు నేతాజీ, గొల్లంగి జగన్నాథరావు, జిల్లా బూత్ లెవెల్ అధ్యక్షుడు దామ మన్మథరావు, రకావాడ చందన బాబు, ధర్మాన జగన్, ధర్మాన బువాజీ, తర్ర జీవరత్నం, కె.కూర్మారావు, బండి ఎర్రన్న, బలగ లక్ష్మి, అర్జున్, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులను పరామర్శించిన డీడీ



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఐటీడీఏ డీడీ విజయశాంతి

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులను ఐటీడీఏ డీడీ విజయశాంతి, ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి వేర్వేరుగా పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ, సాలూరు మండలం మామిడిపల్లి, మక్కువ మండలం ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులపై మరణాలకు సంబంధించి ఆ పాఠశాలల హెచ్ఎమ్ సీతారాం, పుష్పనాథం, మామిడిపల్లి వార్డెన్ విజయలను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. పాఠశాలల్లో సీనియర్ ఉపాధ్యాయులకు ఆ బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. అనంతరం ఐటీడీఏ డీడీ విజయశాంతి పట్టణంలో బంగారమ్మ కాలనీలో ఉన్న బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : జేసీ



కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న జేసీ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: స్వచ్ఛ పార్వతీపురం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో జరిగింది. ఈ నెల స్వచ్ఛమైన గాలి నినాదంలో భాగంగా జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో కె.హేమలత, రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి మొక్కల వల్లే సాధ్యం, ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని కోరారు. వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజా రవాణా వినియోగించాలని, సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచాలని సూచించారు. నిత్యం కొంత సమయం పరిశుభ్రతకు కేటాయించి, దానిని అలవాటుగా మార్చుకున్నప్పుడే స్వచ్ఛ పార్వతీపురం రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో స్వచ్ఛతపై జేసీ ప్రతిజ్ఞ చేయించారు.

నేడు జూనియర్స్ తైక్వాండో క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న జూనియర్స్, క్యాడెట్ తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 19న ఆదివారం నిర్వహించనున్నట్టు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.చారిప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో విజయనగరం వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, గ్రేడింగ్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 7793950599 నంబరును సంప్రదించాలని కోరారు.

నేడు పైడితల్లి అమ్మవారి కలశజ్యోతుల ఊరేగింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి కలశజ్యోతుల ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష శనివారం తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో పైడితల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి స్నపన కార్యక్రమాన్ని నిర్వహించి, వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో విశిష్ట పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం పైడితల్లి అమ్మవారి దీక్షాపరులతో కలశజ్యోతులు పట్టుకుని ఉత్సవ విగ్రహంతో భారీ ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు వనంగుడి నుంచి బయలుదేరుతుందని, దీక్షాపరులు కలశజ్యోతులు చేతపట్టుకుని జై పైడిమాంబ నినాదాలతో గాడీఖానా, వైఎస్ఆర్ సర్కిల్, ఎన్‌సీఎస్ థియేటర్ రోడ్డు, కన్యకపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం మీదుగా చదురుగుడికి చేరుకుని అక్కడ అమ్మవారికి జ్యోతులు సమర్పిస్తారని తెలిపారు. అనంతరం చదురుగుడి వద్ద భారీ ఎత్తున మెట్ల పూజను దీక్షాపరుల ఆదిపీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

బలిజిపేట: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్ఎం వి.వెంకటినాయుడు అభినందించారు. డివిజన్ స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న దీవెన, అండర్ 17 విభాగంలో పదో తరగతి చదువుతున్న చరణ్ స్కూల్ గేమ్స్‌లో గెలుపొందారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొంది పాఠశాలకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో బీవీ రమణ, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మళ్లీ వైద్య పరీక్షలు!

అసలే దివ్యాంగులు.. ఏళ్లుగా పింఛన్ పొందుతున్నారు. అయినా మళ్లీ వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయాలని కూటమి సర్కార్ తలచింది. దీంతో అష్టకష్టాలు పడి మళ్లీ వైకల్య నిర్ధారణ పరీక్షలకు వెళ్లాల్సిన దుస్థితి. ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. ఎంత కష్టమైనా... వైకల్య నిర్ధారణ పరీక్షలకు వెళ్లకుంటే బతుకు జీవనానికి ఆధారంగా ఉన్న పింఛన్ ఆగిపోతుందేమోనన్న ఆందోళన వారిది. అయినా పాలకులకు ఇసుమంత కనికరం లేకుండా పోయింది. పరీక్షలకు రావాల్సిందే... మళ్లీ నిర్ధారించుకోవాల్సిందే.. లేకుంటే కట్! అని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన విభాగం

- ఆందోళనకు గురవుతున్న దివ్యాంగులు
- 5,159 మందికి వైకల్య పరీక్షలకు మళ్లీ రావాలని నోటీసులు
- ఏపీవీవీపీ, జీజీహెచ్‌లో పరీక్షలు చేయనున్న వైద్యులు
- ఫించను తొలగిస్తామని ఆగస్టులో నోటీసులు ఇచ్చిన కూటమి సర్కార్
- మాకు అర్హత ఉందని దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు

విజయనగరం ఫోర్ట్: ఏళ్ల తరబడి పింఛన్ పొందుతున్న దివ్యాంగులకు కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే పెద్ద షాక్ ఇచ్చింది. దివ్యాంగ పింఛన్ పొందుతున్న ప్రతీ దివ్యాంగుడు రీ అసెస్‌మెంట్ చేయించుకోవాలని కూటమి సర్కార్ నోటీసులు అందించింది. సచివాలయాల పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా వారికి ఏ ఆస్పత్రికి ఏ సమయానికి వెళ్లాలి అనే దానిపై నోటీసులు ఇచ్చింది. 2025 జనవరి నెలలో రీ అసెస్‌మెంట్ కార్యక్రమం వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఆగస్టు నెల వరకు నిర్వహించారు. పింఛన్ పునః పరిశీలన మాత్రమే, ఏ ఒక్క దివ్యాంగుడి పింఛన్ తొలగించబోమని అప్పట్లో కూటమి ప్రజాప్రతినిధులు తెలిపారు.

ఆగస్టు నెలలో పింఛన్లు తొలగిస్తామని నోటీసులు

ఆగస్టు నెలలో రీ అసెస్‌మెంట్ 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని చెప్పి జిల్లాలో వేలాది మంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చారు. దీంతో తమకు అర్హత ఉందని చెప్పి జిల్లాలో 5,159 మంది దివ్యాంగులు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు.

మళ్లీ పరీక్షలు..

దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు మళ్లీ వైద్యులు పరీక్షలు చేయనున్నారు. నాలుగు వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఈ పరీక్షలు చేయనున్నారు. ఈ మేరకు దివ్యాంగులకు సచివాలయం ఉద్యోగులు నోటీసులు కూడా అందించారు. ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, గజపతినగరం ఏరియా ఆస్పత్రి, చీపురుపల్లి ఏరియా ఆస్పత్రి, రాజాం ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆర్థో విభాగానికి చెందిన దివ్యాంగులు 3600 మందికి, కంటికి సంబంధించి దివ్యాంగులు 1038మందికి, చెవుడు, మూగకు సంబంధించిన దివ్యాంగులు 465మందికి, మెంటల్ డిజార్డర్‌కు సంబంధించి దివ్యాంగులు 42 మందికి, మెంటల్ ఇల్‌నెస్‌కు సంబంధించిన దివ్యాంగులు 14 మందికి పరీక్షలు చేయనున్నారు.

పింఛన్లు తొలగించేందుకే..

దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతున్నట్టు కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. ఈ చేత్తో ఇచ్చినట్టే ఇచ్చి ఆ చేత్తో లాగేసికొన్నట్టు కూటమి సర్కార్ దివ్యాంగులకు పింఛన్ పెంచి ఆ భారాన్ని తగ్గించుకునే కుట్ర చేస్తుందని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు. పింఛన్ పెంచడం వల్ల కోట్లాది రుపాయిల భారం పడుతుందనే దురుద్దేశంతో కూటమి సర్కార్ పింఛన్ తొలగించడానికే దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ పేరుతో పరీక్షలు చేయిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైకల్య పరీక్షలు

దివ్యాంగ పింఛన్‌కు తమకు అర్హత ఉందని జిల్లాలో 5,159 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి సచివాలయాల ద్వారా ఏ ఆస్పత్రికి, ఏ సమయానికి వెళ్లాలో నోటీసులు వెళ్లాయి. ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు దివ్యాంగులకు పరీక్షలు చేసి సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేయనున్నారు.

–డాక్టర్ ఎన్.పద్మశ్రీరాణి, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి

ఎస్ఐ న్యాయం చేయడం లేదు...

- హత్య చేశాడని ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టలేదు..
- జేసీబీ యజమానికి ఎస్ఐకు బంధుత్వం ఉండడమే కారణం
- మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆవేదన



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మృతుడు రాము తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

చీపురుపల్లి: తమ కుమారుడిని యజమానే హత్య చేశాడని, ఆయనకు గతంలోనూ నేర చరిత్ర ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని మండలంలోని పత్తికాయవలసకు చెందిన మృతుడు యలకల రాము తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన మృతుని తల్లిదండ్రులు యలకల రమేష్, సింహాచలం, చెల్లి రమ, మేనమామలు ముగిది పైడితల్లి, ముగిది గొల్ల, మేనత్తలు ముగిది సత్యవతి, రాధ మాట్లాడారు. కొడుకును పోగొట్టుకుని ఉన్న తమకు న్యాయం జరగడం లేదన్నారు. తమ కుమారుడు రామును సంబంధిత యజమాని వండాన సన్యాసి హత్య చేశాడని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్ఐ పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఐకు జేసీబీ యజమాని వండాన సన్యాసికి బంధుత్వం ఉండడంతోనే హత్య కేసును నీరుగార్చే కుట్ర పన్నుతున్నారనే భయం కలుగుతోందన్నారు. అందుకనే తమకు న్యాయం చేయాలంటూ ఎస్పీ దగ్గరకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఐదారు రోజులు క్రితమే తమ కుమారుడును జేసీబీ యజమాని వండాన సన్యాసి హత్య చేశాడని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే.. ఇంతవరకు కనీసం గ్రామానికి వచ్చి విచారణ నిర్వహించలేదని పేర్కొన్నారు. అందుకే తమకు న్యాయం జరగదని భయం పెరిగిందన్నారు. కూలి పనులు చేసుకునే తమకు ఎలాంటి అండదండలు లేవని పోలీసులు కూడా న్యాయం చేయకపోతే ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. జేసీబీ యజమాని సన్యాసి మొబైల్‌లో అక్టోబర్ 7 నుంచి 12 వరకు కాల్ లిస్ట్ వెల్లడించాలని పోలీసులను కోరామన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి : డీఎంఈ



డీఎంఈని సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, తదితరులు

విజయనగరం ఫోర్ట్: రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఈ (వైద్య విద్యా సంచాలకులు) డాక్టర్ జి.రఘునందన్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శనివారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ విభాగాన్ని, క్యాజువాలటీ, ల్యాబొరేటరీ, ఫిమేల్ శస్త్రచికిత్సల వార్డు, పురుషుల మెడికల్ వార్డును, ఎక్సరే, స్కానింగ్‌లను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. రోగులకు అవసరమైన చికిత్స, మందులు అందజేయాలన్నారు. శస్త్రచికిత్సల కోసం ఆస్పత్రిలో చేరిన వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి శస్త్రచికిత్స సకాలంలో చేయాలన్నారు. రోగులతో ప్రేమగా మాట్లాడి వారికి అవసరమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. అనంతరం ఎండోస్కోప్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంఈని వైద్యులు సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, డాక్టర్ శివ శ్రీధర్, ఎముకలు, మత్తు, న్యూరోసర్జరీ, డెర్మాటాలజీ హెచ్‌వోడీలు డాక్టర్ లోక్‌నాథ్, డాక్టర్ జయదీర్‌బాబు, డాక్టర్ ప్రహ్లాదరెడ్డి, డాక్టర్ వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

23న పీడీఎస్‌వో జిల్లా మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌వో నాయకులు

పార్వతీపురం: పీడీఎస్‌వో జిల్లా మహాసభలు ఈ నెల 23న పార్వతీపురంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షులు కె.సోమేష్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను సోమేష్‌తో కలిసి సంఘ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగంలో వున్న సమస్యలను పరిష్కరించాలని, గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలలో విద్యార్థుల మరణాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు. సభలలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ, ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు, పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కరరావు, ఎస్‌వైఎస్ జిల్లా నాయకులు పీడిక అసిరి తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పశువులకు తనిఖీలు



సుభద్రలో ఉచిత పశువైద్య శిబిరం

బలిజిపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీతానగరం ప్రాంతీయ పశువైద్య శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. సుభద్రలో జిల్లా పశుగణ అభివృద్ధి సంస్థ, విజయనగరం వారి ఆధ్వర్యంలో ఉచిత పశుగర్భకోశ వైద్య శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు అవసరమైన వైద్యసేవలను మనమే గుర్తించి వాటికి తగిన సంరక్షణ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరమన్నారు. శిబిరానికి వచ్చిన వాటిలో 80 పశువులకు తనిఖీలు నిర్వహించి వాటికి అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గణేష్, జి.కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు
యూనివర్సిటీ జట్టులో స్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాల కబడ్డీ టోర్నమెంట్ – 2025లో అద్భుత ప్రదర్శన కనబరిచిన సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు నలుగురు యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు రాబోయే దక్షిణ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయ తరఫున పోటీపడనున్నారు. ఎంపికైన విద్యార్థులలో శ్రీవల్లి, రమ్య, నీలిమ, వరలక్ష్మి ఉన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయి దేవ మణి తెలిపారు. అలాగే జూడో విభాగంలో జరిగిన అంతర్ కళాశాల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి హేమంత్ సౌత్ జోన్ జూడో చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌హెచ్ ప్రసాద్ అభినందించారు.

న్యాయం కోసం.. ఆత్మహత్యా యత్నం..

- తాకట్టు బంగారం కోసం జ్యువెలరీ షాపు వద్ద కుటుంబం నిరసన
- పెట్రోల్ డబ్బాతో బాధితుడి హల్‌చల్



పెట్రోల్‌తో ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతున్న బాధితుడు విజయ్

పార్వతీపురం రూరల్: తాకట్టు పెట్టిన బంగారం తిరిగివ్వాలని కోరుతూ ఓ కుటుంబం బంగారం దుకాణం వద్ద ఆందోళనకు దిగిన ఘటన పట్టణంలో శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. న్యాయం కోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో, బాధితుడు ఏకంగా పురుగుల మందు తాగి, పెట్రోల్‌తో అఘాయిత్యానికి యత్నించడం కలకలం రేపింది. బాధితుడు కోట విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రామాపురం కాలనీకి చెందిన ఆయన, 2019లో తన అవసరాల నిమిత్తం శ్రీస్వామి జ్యువెలరీ యజమాని గెంబలి శంకరరావు వద్ద 30 తులాల బంగారం తాకట్టు పెట్టారు. కొన్నాళ్లకు శంకర్రావు కరోనాతో మరణించగా, ఆయన కుమారులు పృథ్వీ, విజయ్ కుమార్‌లను సంప్రదించినట్టు బాధితుడు విజయ్ తెలిపారు. అప్పటి నుంచి రెండేళ్లుగా ఇదిగో ఇస్తాం, అదిగో ఇస్తాం అంటూ వారు కాలయాపన చేస్తున్నారని బాధితుడు వాపోయాడు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినా, 15 తులాలకు లెక్క తేల్చాలని చూశారని, ఆ మాట కూడా నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎక్కడా న్యాయం జరగకపోవడంతో విసిగిపోయిన విజయ్, చివరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే, కేసు నమోదు చేసిన పోలీసులు సైతం చేతులు దులుపుకొన్నారని, తమకు న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని బాధితుడు ఆరోపించాడు. పోలీసుల నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో శనివారం నేరుగా జ్యువెలర్ షాపు వద్దకు చేరుకున్నాడు. షాపులోకి వెళ్లి పురుగుల మందు తాగేందుకు, పెట్రోల్‌తో ఆత్మహత్యకు ప్రయత్నించగా, కుటుంబ సభ్యులు శ్రీదేవి, సాయిరూప అడ్డుకున్నారు. అనంతరం షాపు గేట్లు మూసివేసి నడిరోడ్డుపై బైఠాయించడంతో తీవ్ర ఆందోళనకర వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్ఐ జగదీష్‌నాయుడు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా బాధితులు వెనక్కి తగ్గలేదు. అనంతరం సీఐ మురళీధర్ సైతం అక్కడికి చేరుకున్నారు. కేసు నమోదు చేసిన విషయాన్ని ఆయన ధ్రువీకరించినప్పటికీ, బాధితుల ఆందోళన మాత్రం చల్లారలేదు. పోలీసుల జోక్యం చేసుకున్నప్పటికీ ఈ వ్యవహారం రాజకీయ మలుపు తిరిగింది. శనివారం సాయంత్రం పట్టణానికి చెందిన ఓ తెలుగుదేశం నాయకుడి ఆధ్వర్యంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగినట్టు బాధితులు వాపోయారు. సోమవారం నాటికి చెల్లింపులు జరిపేలా సయోధ్య కుదిరిందని బాధితులు తెలపడంతో ఆందోళన విరమించారు. చట్టపరంగా, పోలీస్‌స్టేషన్ ద్వారా తేలాల్సిన వివాదం, చివరకు రాజకీయ నాయకుడి పంచాయతీతో తాత్కాలికంగా రాజీ అయినట్టు బాధితుల తెలిపిన వివరాల మేరకు స్పష్టమైంది

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గౌరునాయుడు మృతదేహం

కురుపాం: కాటందొరవలస గ్రామ సమీపంలో గల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... పూతికవలస గ్రామానికి చెందిన గొట్టాపు గౌరునాయుడు బైక్‌తో వెళ్తుండగా కాటందొరవలస గ్రామ సమీపంలో ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. 108కు స్థానికులు సమాచారం ఇచ్చినా ఎంతకీ రాకపోవడంతో స్థానికులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ గ్రామానికి చెందిన కిల్లక మౌళి(45) శుక్రవారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బైక్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు క్షతగాత్రున్ని భద్రగిరి ఆసుపత్రికి తీసుకురాగా ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు శనివారం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయడంతో అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు మౌళికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



ప్రకాష్‌యాదవ్ మృతదేహం

బొబ్బిలి: చర్చీస్క్వేర్‌లోని పాట్నాకు చెందిన ఓం ప్రకాష్‌యాదవ్(30) శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి రైలులో వస్తుండగా జారి పడిపోయి మృతి చెందినట్టు రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. గుర్తు తెలియని రైలులో ఉదయం 4.15 గంటలకు ముందు జారి పడినట్టు భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించినట్టు తెలిపారు. జీఆర్‌పీ అవుట్ పోస్టు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

'రియల్'గా మోసం..!



చిననడిపల్లి రెవెన్యూ పరిధిలోని మెగా వెంచర్‌లో షర్లశాల



వ్యవసాయ భూముల్లో చదును చేసి వేసిన రియల్ ఎస్టేట్ ప్లాట్లు



మెగా వెంచర్‌లో రోడ్లు

- 69 ఎకరాల్లో అనధికారికంగా వెంచర్
- పంచాయతీ, ఉడా అనుమతులు లేకుండానే..
- ప్లాట్ నంబర్లతో దర్జాగా రిజిస్ట్రేషన్లు
- చూసీ చూడనట్టు వదిలేస్తున్న అధికారులు

చీపురుపల్లి: వడ్డించే వాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా.. అనే సామెతలా ఏం చేసినా చర్యలు తీసుకోని అధికార యంత్రాంగం ఉండగా మనల్ని ఎవడ్రా ఆపేది అంటూ రియల్టర్లు రెచ్చిపోతున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా పెద్ద పెద్ద వెంచర్లు వేసి దూర ప్రాంతాల్లో ఉండే కొనుగోలుదారులను మోసం చేసి యథేచ్ఛగా అమ్మకాలు జరిపేస్తున్నారు. ఇదంతా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్టే వదిలేస్తున్నారు. దీని వెనుక రియల్టర్లతో అధికార యంత్రాంగానికి ఉన్న సన్నిహిత సంబంధాలే కారణమనే చర్చ జరుగుతోంది. దీనికి మండలంలోని చిననడిపల్లి రెవెన్యూ పరిధిలో వెలిసిన 69 ఎకరాల మెగా వెంచర్ చక్కని అద్దం పడుతోంది. ఈ మెగా వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండానే రియల్‌గా కొనుగోలుదారులను మోసం చేసి అమ్మకాలు జరుపుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఎలాంటి అనుమతులు లేని ఈ వెంచర్‌లో ప్లాట్ నంబర్లు వేసి మరీ దర్జాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి.

చిననడిపల్లి రెవెన్యూలో 69 ఎకరాల మెగా వెంచర్

మండలంలోని శివారు పంచాయతీ చిననడిపల్లి రెవెన్యూ పరిధిలో మండల సర్వేయర్ తెలిపిన సర్వే నంబర్ల ప్రకారం సర్వే నంబర్ 73, 94, 93, 92ల్లో దాదాపు 69 ఎకరాల వ్యవసాయ భూమిని చదును చేసి మెగా రియల్ వెంచర్‌ను సిద్ధం చేశారు. అందులో స్థలాలను ప్లాట్లుగా విభజించి రోడ్లు వేసి సిద్ధం చేశారు. ప్రస్తుతం సర్వే నంబర్ 73కు చెందిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయి. చిననడిపల్లి నుంచి శ్రీకాకుళం జిల్లాలోని కమ్మసిగడాం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ మెగా వెంచర్‌లో ఇప్పటికే ప్లాట్లు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

పంచాయతీ, ఉడా అనుమతులు లేకుండానే..

సాధారణంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చినప్పుడు ల్యాండ్ కన్వర్షన్ ఫీజు రెవెన్యూ శాఖ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదట. అంతేకాకుండా కనీసం పంచాయతీ తీర్మానం ద్వారా అనుమతులు, ఉడా అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు.

మోసపోతున్న కొనుగోలుదారులు

ఎలాంటి అనుమతులు లేకుండా ఇక్కడి మెగా వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేస్తున్న ఎంతో మంది కొనుగోలుదారులు మోసపోతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. పంచాయతీ, ఉడా అనుమతులు లేని ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోవాలన్నా బ్యాంకు రుణాలు కూడా రావు. అంతేకాకుండా పంచాయతీ ఇంటి నిర్మాణ ప్లాన్ అనుమతులు కూడా ఇవ్వదు. ఇవన్నీ తెలియకుండానే కొనుగోలుదారుకు ఏవో మాయ మాటలు చెప్పి రియల్ ఎస్టేట్ యజమానులు ప్లాట్లు అంటగడుతున్నట్టు చర్చ జరుగుతోంది. మండలంలోని పత్తికాయవలస సమీపంలో గతంలో ఇలాంటి రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్మకాలు జరిపారు. ఇప్పుడు ఆ వెంచర్‌లో రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం..

చిననడిపల్లి రెవెన్యూ పరిధిలో సిద్ధమైన మెగా వెంచర్ తమ దృష్టికి ఇంతవరకు రాలేదు. ఇంతవరకు ఎలాంటి వెంచర్లకు అనుమతులు ఇవ్వలేదు. తక్షణమే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తున్నాం.

– ఐ.సురేష్, ఎంపీడీఓ, చీపురుపల్లి

అనుమతులు లేకపోయినా రిజిస్ట్రేషన్ చేయొచ్చు..

రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి పంచాయతీ, ఉడా అనుమతులు లేకపోయినప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయొచ్చు. చిననడిపల్లి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 73లో మెగా వెంచర్‌లో ప్లాట్ నంబర్‌లతో సహా రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం.

– లక్ష్మణరావు, సబ్ రిజిస్ట్రార్, చీపురుపల్లి